ఫోన్ల ట్యాపింగ్ కేసులో.. నేడు భుజంగరావు బెయిల్‌పై తీర్పు

29 వరకు రిమాండ్ గడువు పొడిగింపు

నాంపల్లి కోర్టులు, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ): ఫోన్ల ట్యాపింగ్ కేసులో చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీలుగా కొనసాగుతున్న అదనపు ఎస్పీలు ప్రణీత్‌రావు, తిరుపతన్న, రాధాకిషన్‌రావును మంగళవారం కోర్టు ఎదుట జైలు అధికారులు హాజరుపర్చారు. అదనపు ఎస్పీ భుజంగరావు బెయిల్‌పై బుధవారం 1వ అదనపు జిల్లా కోర్టు జడ్జి రమాకాంత్‌రావు తీర్పును ప్రకటించనున్నారు. ప్రస్తుతం మధ్యంతర బెయిల్‌పై ఉండి.. చికిత్స పొందుతున్న నేపథ్యంలో బెయిల్ పిటిషన్‌పై ఆసక్తిని నెలకొల్పుతున్నది. తదుపరి ఉత్తర్వులు జారీ అయ్యేంత వరకు గతంలో వెల్లడించిన మధ్యంతర ఉత్తర్వులకు చెందిన షరుతులు వర్తిస్తాయని మెజిస్ట్రేట్ తెలిపారు. బెయిల్ మంజూరు కాని పక్షంలో మధ్యంతర బెయిల్‌పై అనిశ్చితి ఏర్పడుతుంది. బెయిల్ మంజూరైతేనే మధ్యంతర బెయిల్ కొనగించుకునే అవకాశం ఉంది. ఇటీవలే 35 రోజుల పాటు ఆయనకు మధ్యంతర బెయిల్ మంజూరైంది. గుండె, మూత్రకోశ, షుగర్ వ్యాధులతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. 35 రోజులుగా బెయిల్‌పై ఉండి శస్త్ర చికిత్సలు చేయించుకుంటున్నారని న్యాయవాది కోర్టుకు వివరించారు. భుజంగరావు కోర్టుకు గైర్హాజరు కావడంతో ఆయన తరపున గైర్హాజరు పిటిషన్‌ను కోర్టుకు సమర్పించారు. కోర్టు సైతం గైర్హాజరు పిటిషన్‌ను అంగీకరించి, రిమాండ్ గడువును 29 వరకు పొడిగిస్తూ 12వ అదనపు చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఈశ్వరయ్య ఉత్తర్వులు జారీ చేశారు.

74 ఏండ్ల వృద్ధుడికి ప్రాణదానం

అధునాతన ఆర్‌డీఎన్ చికిత్స నిర్వహించిన వైద్యులు

ఖైరతాబాద్, అక్టోబర్ 15: పలు అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఓ వృద్ధుడికి అధునాతన శస్త్ర చికిత్సతో వైద్యులు ప్రాణం పోశారు. చిక్కడపల్లి చెందిన 74 ఏండ్ల వృద్ధుడు అధిక రక్తపోటు, మధుమేహం, కరోనరీ హార్ట్ వ్యాధులతో బాధపడుతూ బంజారాహిల్స్ కేర్ హాస్పిటల్‌లో చేరాడు. వివిధ పరీక్షలు నిర్వహించిన వైద్యులు నాన్ ఇస్కీమిక్ హైపర్టెన్సివ్ లెఫ్ట్ వెంట్రిక్యులర్ వైఫల్యమయ్యే ప్రమాదాన్ని గుర్తించారు. కేర్ క్యాథ్ ల్యాబ్ క్లినికల్ డైరెక్టర్, సీనియర్ ఇంటర్వేన్షల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ పీఎల్‌ఎన్ కపర్ది నేతృత్వంలో వైద్యుల బృందం అధునాతన రీనల్ డినర్వేషన్ ప్రక్రియ ద్వారా రోగికి చికిత్స అందించారు.

శస్త్ర చికిత్స అనంతరం రోగితో వైద్య సిబ్బంది

దీంతో రక్తపోటు అదుపులోకి రావడంతో సాధారణ స్థితికి చేరుకున్నాడు. 74 ఏండ్ల వయస్సులో ఇలాంటి చికిత్సలు అందించడం అత్యంత క్లిష్టమైందని, రోగిని ఎలాగైనా కాపాడాలన్న ఉద్దేశంతో వైద్యులు అంకితభావంతో చికిత్స చేశారని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అజిత్ సింగ్ తెలిపారు.

డబ్బుల విషయంలో మధ్యవర్తిత్వం

- **బాకీ విషయంలో ఆత్మహత్యాయత్నం**
- **స్పందించని 108**
- **ఆగ్రహించిన నాయకులు**

బండ్లగూడ,అక్టోబర్ 15: డబ్బుల విషయంలో మధ్యవర్తిగా ఉండి.. ప్రాణాల మీదకు తెచ్చుకున్నాడు ఓ వ్యక్తి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కోస్గీ నుంచి బతుకు దేరువు కోసం వచ్చిన శేఖర్ కిస్మత్‌పూర్‌లో ఉంటున్నాడు. స్థానికంగా వంటలు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి భార్యా ఇద్దరు పిల్లలున్నారు. డబ్బుల విషయంలో తన బంధువులకు మధ్యవర్తిగా ఉండి.. కొంత డబ్బు అప్పుగా ఇప్పించినట్టు స్థానికులు తెలిపారు. బంధువులు అప్పు చెల్లించకపోవడంతో కొంత కాలంగా శేఖర్ ఆ డబ్బుకు సంబంధించిన వడ్డీలు చెల్లిస్తున్నాడు. ఇదిలా ఉండగా.. మంగళవారం డబ్బుల విషయంపై అతడు బంధువులతో ఫోన్‌లో మాట్లాడాడు. ఆ తర్వాత తీవ్ర మనస్తాపానికి గురైన శేఖర్ కొంత సేపటి తర్వాత మద్యంలో యాసిడ్ కలుపుకొని తాగాడు. అతడిని గమనించిన అన్న కుమారుడు కేకలు వేశాడు. ఇంటి పక్కనే ఉన్న మన్నె మోహన్ గమనించి చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

స్పందించని 108..

శేఖర్‌ను ఆస్పత్రికి తరలించేందుకు స్థానికంగా ఉన్న మోహన్ పలుమార్లు 108కు ఫోన్‌చేయగా స్పందించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ఆపదలో ఉన్న వారి కోసం 108ను ప్రవేశపెట్టారని తెలిపారు. ఇప్పుడు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఉన్నా.. 108ను మెరుగుపర్చకపోవడం సిగ్గుచేటన్నారు. నేను కూడా కాంగ్రెస్ నాయకుడినే.. ప్రభుత్వాలు ప్రజల కోసం పనిచేయాలన్నారు.

మల్లాపూర్‌లోని సూర్యనగర్ ప్రధాన మార్గంలో పేరుకుపోయిన చెత్త కుప్పలు

ఇన్‌స్టాగ్రామ్‌లో క్లిక్‌కు రూ.150 ఇస్తామంటూ..

రూ. 20.35 లక్షలు కొట్టేసిన సైబర్ క్రిమినల్స్

సిటీబ్యూరో, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ): ఇన్‌స్టాగ్రామ్ వీడియోలు క్లిక్ చేసి.. రేటింగ్ తెచ్చి భారీగా డబ్బు సంపాదించవచ్చంటూ నమ్మించిన సైబర్ నేరగాళ్లు సికింద్రాబాద్‌కు చెందిన బాధితుడి వద్ద నుంచి రూ. 20.35 లక్షలు కాజేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ఫ్రెష్ వరల్డ్ కంపెనీ పేరుతో బాధితుడి ఫోన్‌కు ఒక మెసేజ్ వచ్చింది. ఇన్‌స్టాగ్రామ్‌లో రేటింగ్ పెంచేందుకు క్లిక్స్ పరంగా డబ్బులు సంపాదించవచ్చని, దీనిపై అవగాహన కల్పిస్తామన్నారు. ఇందులో ఇన్‌స్టాగ్రామ్ వీడియోలు లైక్ చేయడం, స్క్రీన్ షాట్స్ తీసి పంపాలంటూ సూచించారు. దీనికి ఆకర్షితుడైన బాధితుడికి ఒక క్లిక్‌కు రూ. 150 వస్తుందని, ఇంట్లో కూర్చొని రోజూ రూ.4 వేల నుంచి రూ. 5 వేల వరకు సంపాదించవచ్చని సూచించారు. వర్క్‌ఫ్రమ్ హోంతో మీరు సంపాదించాలనుకుంటే మా మెసేజ్‌కి మీరు 'ఒకే' అని మెసేజ్ పంపించాలని, ఆ తర్వాత మీకు టెలిగ్రామ్‌లో లింక్ పంపిస్తామని చెప్పారు. ఆ లింక్ ద్వారా మీరు వర్క్ ప్రారంభించవచ్చని సూచించారు. అయితే, దీనికి కొంత మొత్తం పెట్టుబడిగా పెట్టాలని, అది క్రిప్టో కరెన్సీలో పెట్టాలని సూచించి, మొదట కొంత డబ్బును పెట్టుబడిగా పెట్టించారు. ఆ తరువాత డబ్బు తిరిగి రాలేదు. దీంతో తన డబ్బులు తనకు తిరిగి ఇవ్వాలంటూ బాధితుడు కోరాడు. నీవు చేసిన పనితో కంపెనీకి నష్టం వచ్చింది.. డబ్బులు తిరిగి ఇవ్వం.. కొత్త వర్క్ ఇస్తామంటూ నమ్మించి దఫ దఫాలుగా బాధితుడి వద్ద నుంచి రూ. 20.35 లక్షలు కాజేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

బాలికతో పెండ్లి.. నిందితుడికి పదేండ్ల జైలు

రంగారెడ్డి జిల్లా కోర్టులు, అక్టోబర్15 (నమస్తే తెలంగాణ): ప్రేమ పేరుతో బాలికకు మాయమాటలు చెప్పి పెండ్లి చేసుకున్న యువకుడు అనిల్(22)కు పదేండ్ల జైలు శిక్ష, రూ.15వేల జరిమానా విధిస్తూ.. బాధిత బాలికకు రూ.పది లక్షల పరిహారం అందజేయాలని ఆదేశిస్తూ రంగారెడ్డి జిల్లా ప్రత్యేక పోక్సో న్యాయమూర్తి ఎం.కె. పద్మావతి తీర్పునిచ్చారు. స్పెషల్ పీపీ సునీత బర్ల కథనం ప్రకారం.. బాలిక (16)తండ్రి చనిపోయాడు. బాలిక తల్లితో కలిసి హైదరాబాద్‌కు వచ్చి వనస్థలిపురంలో ఉంటూ ఇండ్లల్లో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తూ.. స్థానిక కళాశాలలో ఇంటర్ చదువుతున్నది. ఆర్థిక ఇబ్బందులతో కొంతకాలం కళాశాలకు వెళ్లకుండా ఇంటి వద్దనే ఉన్నది. అదే ప్రాంతంలో ఉన్న బాలిక బంధువైన అనిల్ పరిచయమయ్యాడు. అతడు మేస్త్రి పనులు చేస్తున్నాడు. బాలికకు మాయమాటలు చెప్పి ప్రేమలోకి దింపిన అనిల్.. 2019, జనవరి 18వ తేదీన ఆమెను ఇంట్లో నుంచి తీసుకువెళ్లి వివాహం చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న బాలిక తల్లి వనస్థలిపురం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. తదుపరి దర్యాప్తు పూర్తిచేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయస్థానం నిందితుడు అనిల్‌కు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది.

వాయిదాలు చెల్లించడంలేదని కిడ్నాప్.!

గుల్బర్గాలో నిందితులను పట్టుకున్న పోలీసులు

చార్మినార్, అక్టోబర్ 15 : వాయిదాల పద్ధతిలో కొనుగోలు చేసిన వస్తువుల నెలవారీ ఈఎంఐ చెల్లించకపోవడంతో ఓ వ్యక్తిని కిడ్నాప్ చేసేందుకు యత్నించిన నిందితులను ఫలక్‌నుమా పోలీసులు పట్టుకున్నారు. ఫలక్‌నుమా ఏసీపీ జావెద్ తెలిపిన వివరాల ప్రకారం.. రెయిన్‌బజార్ ప్రాంతానికి చెందిన మహ్మద్ హమీద్ (24) వ్యాపారి. అతడి వద్ద ఫలక్‌నుమా పరిధిలోని బీబీకా ఛష్మ ప్రాంతానికి చెందిన జుబేర్ రెండు నెలల కిందట వాషింగ్ మెషిన్‌తో పాటు రిఫ్రిజిరేటర్‌ను రూ. 30 వేలకు వాయిదాల పద్ధతిలో కొనుగోలు చేశాడు. ఇందుకు జమానత్‌గా అదే ప్రాంతానికి మహ్మద్ అలీ ఉన్నాడు. ఇటీవల జుబేర్ గుల్బర్గా వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కొనుగోలు చేసిన వస్తువుల నెలవారీ వాయిదాలు కూడా చెల్లించలేదు. ఈ విషయాన్ని వ్యాపారి హమీద్ తన స్నేహితులతో చెప్పడంతో.. జమానత్‌గా ఉన్న అలీని ప్రశ్నిస్తే.. జుబేర్ వివరాలు తెలుస్తాయని సలహా ఇచ్చారు. అలీని అడుగగా.. జుబేర్ గుల్బర్గాలో ఉన్నట్టు చెప్పాడు. దీంతో ఈనెల 13న హమీద్, అతడి స్నేహితులు మహ్మద్ సిరాజ్ ఖాన్ (42), అంజాద్ ఖాన్ (38), సయ్యద్ ఖాజా షరీఫుద్దీన్ (24), మహ్మద్ రహీం పాషా (37), మహ్మద్ షేక్ ఆసిఫ్ (25) కలిసి బలవంతంగా అలీని కారులో ఎక్కించుకొని గుల్బర్గా బయలుదేరారు. 13వ తేదీ అర్ధరాత్రి దాటినా కూడా అలీ ఇంటికి వెళ్లకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. ఫోన్ కాల్స్, సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేపట్టి గుల్బర్గా వెళ్తున్నట్టు గుర్తించారు. వెంటనే అప్రమత్తమైన ఫలక్‌నుమా ఇన్‌స్పెక్టర్ ఆదిరెడ్డి గుల్బర్గా సుల్తాన్‌పుర్ పోలీసులను అలర్ట్ చేశారు. అక్కడి పోలీసులు రోడ్డుపై విస్తృతంగా వాహనాలు తనిఖీ చేశారు. నిందితులు వెళ్తున్న క్వాలిస్ వాహనాన్ని గుర్తించిన సుల్తాన్‌పుర్ పోలీసులు.. నిందితులందరినీ అదుపులోకి తీసుకున్నారు. ఫలక్‌నుమా పోలీసులు మంగళవారం నిందితులను అదుపులోకి తీసుకున్నట్టు ఏసీపీ జావెద్ తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలిస్తున్నట్టు ఏసీపీ తెలిపారు.

వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ జావెద్

విద్యుత్‌షాక్‌తో ఒకరు మృతి

ఉప్పల్: విద్యుత్‌షాక్‌కు గురైన ఓ వ్యక్తి మృతి చెందాడు. చర్లపల్లి పోలీసుల కథనం ప్రకారం.. మేడ్చల్ జిల్లా ఘనాపూర్‌కు చెందిన శివనాయక్ (23) ఉప్పల్‌లో నివాసముంటూ చర్లపల్లి పారిశ్రామికవాడలోని ఫేజ్-2లో ఉండే బయోపల్స్‌లో ఎలక్ట్రిషియన్‌గా పనిచేస్తున్నాడు. పరిశ్రమలోని గోడకు డ్రిల్ చేస్తుండగా విద్యుత్ వైర్లు తెగిపోవడంతో శివనాయక్ కరెంట్ షాక్‌కు గురై కిందపడిపోయాడు. కార్మికులు గమనించి వెంటనే వైద్యం కోసం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

నేటి నుంచి వ్యర్థాల తరలింపు

సిటీబ్యూరో, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ): వ్యర్థాల నిర్వహణ జీహెచ్ఎంసీకి సవాల్‌గా మారుతున్న నేపథ్యంలో దిద్దుబాటు చర్యలకు అధికారులు ఉపక్రమించారు. హైదరాబాద్ నగరాన్ని చెత్త రహిత నగరంగా తీర్చి దిద్దాలన్న లక్ష్యంలో భాగంగా తాజాగా 21 రోజుల ప్రత్యేక కార్యాచరణ అమలుకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు బుధవారం నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకు లెగిసి వెస్ట్ (పాత చెత్త) తొలగింపునకు స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నది. మొదటి దశలో నేటి నుంచి 22 వరకు, రెండో దశలో 23 నుంచి 29వరకు, మూడో దశలో నవంబర్ 2 నుంచి 8 వరకు పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించనుంది. నిర్మాణ వ్యర్థాల తరలింపులో కీలకంగా ఉన్న ఎజెన్సీలు, పారిశుధ్య విభాగం కలిసి ప్రతి డివిజన్‌కు రెండు వాహనాలను సమకూర్చనున్నారు.

అనుమానాస్పద స్థితిలో యువతి అదృశ్యం

బంజారాహిల్స్, అక్టోబర్15: అనుమానాస్పద స్థితిలో యువతి అదృశ్యమైంది. ఈ ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గాస్ మండి ఆడయ్యనగర్‌కు చెందిన పి.సౌజన్య(27) ఎమ్మెల్యే కాలనీ లోటస్ పాండ్ సమీపంలోని ఉచ్వాస్ రిహాబిలేషన్ సెంటర్‌లో డైటీషియన్‌గా పనిచేస్తున్నది. కొంతకాలంగా పవన్ అనే వ్యక్తితో స్నేహంగా ఉంటున్న విషయాన్ని గుర్తించిన కుటుంబసభ్యులు ఆమెకు నచ్చజెప్పడంతో దూరంగా ఉంటున్నది. కాగా, తనతో దూరంగా ఉంటున్న విషయాన్ని జీర్ణించుకోలేని పవన్ తరచూ ఆమెకు ఫోన్ చేసి బ్లాక్‌మెయిల్ చేయడం మొదలుపెట్టాడు. ఒకవైపు కుటుంబసభ్యుల మాటలు.. రెండోవైపు పవన్ వేధింపులు ఎక్కువ కావడంతో తాను అత్మహత్య చేసుకునేందుకు వెళ్తున్నానంటూ కుటుంబసభ్యులకు మెసేజ్ పెట్టిన సౌజన్య.. లోటస్ పాండ్‌లోని తన ఆఫీస్ నుంచి సోమవారం సాయంత్రం అదృశ్యమైంది. ఈ మేరకు అన్ని ప్రాంతాల్లో గాలించినా లాభం లేకపోవడంతో మంగళవారం తల్లి జయశ్రీ ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

కత్తితో మహిళకు బెదిరింపులు

యువకుడిపై కేసు నమోదు

బంజారాహిల్స్, అక్టోబర్ 15: కత్తితో మహిళను బెదిరిస్తున్న యువకుడిపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. నవోదయ కాలనీలో నివాసముంటున్న వివాహిత (36) తన ఇంటికి సమీపంలో ఉన్న టైలర్ షాపులో చాలా కాలంగా బట్టలు కుట్టిస్తున్నారు. టైలర్ కొడుకు రిషి (21) గత కొంత కాలంగా షాపునకు వెళ్తున్న వివాహితను అక్కా అని పిలుస్తూ అప్పుడప్పుడు మాట్లాడాడు. కాగా, కొన్ని రోజుల నుంచి ఆ యువకుడి ప్రవర్తనలో మార్పు రావడంతో పాటు అసభ్యకర మెసేజ్‌లు పెట్టడం, రాత్రిపూట కాల్స్ చేస్తూ న్యూసెన్స్ చేస్తున్నాడు. దీంతో నాలుగు రోజుల కిందట జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. పెటీ కేసు నమోదు చేసిన పోలీసులు అతడిని పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చారు. తమ కుమారుడి మానసిక స్థితి సరిగాలేకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తిందంటూ రిషి కుటుంబసభ్యులు సర్దిచెప్పారు. మంగళవారం తెల్లవారుజామున వివాహిత ఇంటి వద్దకు కత్తితో వచ్చిన రిషి న్యూసెన్స్ చేయడంతో పాటు చంపి వేస్తానంటూ బెదిరింపులకు గురిచేశాడు. దీంతో జూబ్లీహిల్స్ పోలీసులకు సమాచారమివ్వగా అతడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ట్రేడింగ్ పేరుతో రూ.78.50 లక్షలు మోసం

సైబర్ నేరగాళ్ల ఖాతాలు ఫ్రీజ్

బాధితుడికి రూ.39 లక్షలు ఇప్పించిన సైబర్ కాప్స్

సిటీబ్యూరో, అక్టోబర్15 (నమస్తే తెలంగాణ): ట్రేడింగ్‌లో అధిక లాభాలు ఇప్పిస్తామంటూ నమ్మించి నగర వాసి నుంచి సైబర్‌నేరగాళ్లు రూ. 78,70,500 కాజేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన హైదరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు.. నిందితులకు సంబంధించిన బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేసి.. రూ.39 లక్షలు బాధితుడికి తిరిగి ఇప్పించారు. సైబర్‌క్రైమ్స్ డీసీపీ దార కవిత కథనం ప్రకారం.. నగరానికి చెందిన ఓ నిరుద్యోగ యువకుడికి స్టాక్ ట్రేడింగ్‌లో లాభాలు ఇప్పిస్తామంటూ సైబర్‌నేరగాళ్లు మోసం చేశారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌రావు బృందం దర్యాప్తు చేపట్టింది. నిందితులకు సంబంధించిన బ్యాంకు ఖాతాలను గుర్తించి, వాటిని ఫ్రీజ్ చేశారు. ఫ్రీజ్ చేసిన ఖాతాల్లోంచి రూ.39 లక్షలు కోర్టు అనుమతితో బాధితుడికి తిరిగి ఇప్పించారు.

మెట్రో రైలులో వృద్ధురాలి సొత్తు మాయం

బంజారాహిల్స్, అక్టోబర్ 15: మెట్రోరైలులో ఎక్కిన ఓ మహిళ బ్యాగులోంచి నగదుతో పాటు బంగారం మాయమైంది. ఈ ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. హనుమకొండలోని నక్కలగుట్ట ప్రాంతానికి చెందిన శోభలత వృద్ధురాలు. ఈ నెల 10న కంటి పరీక్షల కోసం బంజారాహిల్స్‌లోని ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రికి తన సోదరితో కలిసి వచ్చింది. చికిత్స తర్వాత సొంతూరుకు వెళ్లే క్రమంలో జూబ్లీహిల్స్ రోడ్ నం. 5లోని మెట్రోస్టేషన్ వద్దకు వచ్చి ట్రైన్ ఎక్కింది. ఉప్పల్ సమీపంలోని ఎన్‌జీఆర్ఐ స్టేషన్‌లో మెట్రో దిగి అక్కడి నుంచి బస్సులో హన్మకొండకు వెళ్లిపోయింది. ఇంటికి వెళ్లిన తర్వాత తన బ్యాగులో చూసుకోగా.. రూ.12వేల నగదుతో పాటు 5 గ్రాముల చెవి కమ్మలు కనిపించలేదు. తాను జూబ్లీహిల్స్ రోడ్ నం.5 లోని మెట్రోస్టేషన్‌లో ప్రవేశించిన సమయంలో బ్యాగును స్కాన్ చేశారని, బ్యాగులో నగదు ఉన్న విషయాన్ని గుర్తించిన సెక్యూరిటీ సిబ్బంది ఈ విషయాన్ని దొంగలకు చెప్పి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తూ బాధితురాలు హన్మకొండ నుంచి వచ్చి సోమవారం రాత్రి జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

సాహితీ ఇన్‌ఫ్రా అధినేత లక్ష్మీనారాయణను విచారిస్తున్న ఈడీ

నాంపల్లి కోర్టులు, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ): సాహితీ ఇన్‌ఫ్రా సంస్థ అధినేత లక్ష్మీనారాయణను ఈడీ అధికారులు విచారిస్తున్నారు. 5 రోజుల కస్టడీకి అప్పగిస్తూ ఈడీ కోర్టు జారీ చేసిన ఉత్తర్వుల మేరకు 14వ తేదీ నుంచి 18 వరకు అధికారులు ఈడీ కస్టడీకి తరలించారు. ఈడీ అధికారులు అతడిని గోప్యంగా విచారిస్తున్నారు. దాదాపు 3000 మంది బాధితుల నుంచి రూ.1500 కోట్ల వరకు వసూళ్లు చేసి బోర్డు తిప్పేసిన తర్వాత.. సంస్థపై 50కి పైగా కేసులు నమోదయ్యాయి. కోట్ల రూపాయలు చేతులు మారాయని, వీటికి సంబంధించిన లావాదేవీల వివరాలపై ఈడీ అధికారులు ఆరా తీస్తున్నారు. కీలక ఆధారాలను, పత్రాలను సేకరించిన అధికారులు.. వాటికి సంబంధించిన సమాచారాన్ని రాబట్టేందుకు ప్రయత్నిస్తున్నారు.

బిల్డింగ్ పైనుంచి కిందపడి..

కాచిగూడ, అక్టోబర్ 15: మనస్తాపంతో బిల్డింగ్ పైనుంచి దూకి ఓ మహిళ మృతి చెందింది. కాచిగూడ ఇన్‌స్పెక్టర్ చంద్రకుమార్ కథనం ప్రకారం.. నెహ్రూనగర్ ప్రాంతానికి చెందిన గౌస్ భార్య ఫౌజియాబేగం(35) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఇటీవల పక్షవాతం కూడా వచ్చింది. అనేక దవాఖానల చుట్టూ తిరిగినా నయం కాలేదు. దీంతో మనస్తాపం చెందిన ఆమె మంగళవారం బిల్డింగ్ ఫస్ట్‌ఫ్లోర్ పైనుంచి దూకి అక్కడికక్కడే మృతి చెందింది. ఎస్సై నరేశ్ కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖాన మార్చురీకి తరలించారు.

రూ.10 నాణేలు చెల్లుతాయి..

యూబీఐ పబ్లిక్ అవేర్నెస్ ప్రోగ్రామ్

సిటీబ్యూరో, అక్టోబర్15: (నమస్తే తెలంగాణ): యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రూ.10నాణేలు చెల్లుతాయంటూ సోమ, మంగళవారాల్లో పబ్లిక్ అవేర్నెస్ ప్రోగ్రామ్ చేపట్టింది. పది రూపాయల నాణెం చెల్లదన్న అపోహ ప్రజల్లో బలంగా ఉండటంతో ఆర్బీఐ గైడ్‌లైన్స్ ప్రకారం యూబీఐ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. చిన్న చిన్న హోటళ్లు, కిరాణా దుకాణాలు, చిన్న వ్యాపారాలు చేసుకునే వారి దగ్గరకు వెళ్లి ఆర్బీఐ పది రూపాయల నాణేలను రద్దు చేయలేదు.. మేము తీసుకుంటాం.. మీరూ తీసుకోండి.. అంటూ అవగాహన కల్పించింది. ఇందుకోసం కరపత్రాలు, స్టిక్కర్స్‌ను ఆయా దుకాణాల వద్ద అంటించి.. ప్రజలకు కూడా పది రూపాయల నాణేలు చెల్లుతాయన్న అవగాహన కల్పించే కార్యక్రమం చేపట్టింది.

నకిలీ పాల ఉత్పత్తులు.. ఎస్ఓటీ పోలీసులు దాడి

పీర్జాదిగూడ, అక్టోబర్ 15: మేడిపల్లి పీఎస్ పరిధిలో నకిలీ పాల ఉత్పత్తులను తయారు చేసి, విక్రయిస్తున్న స్థావరంపై మల్కాజిగిరి జోన్ ఎస్ఓటీ పోలీసులు దాడిచేసి, నిర్వాహకుడిని అదుపులోకి తీసుకున్నారు. పామ్ ఆయిల్, ఎసిటిక్ యాసిడ్, డాల్డా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఓటీ పోలీసుల కథనం ప్రకారం.. పాత బోయిగూడకు చెందిన గజేందర్‌సింగ్ రాజ్‌పురోహిత్ (51) పీర్జాదిగూడలోని ఓ ఇంటిలో కొంతకాలంగా పామ్ ఆయిల్, ఎసిటిక్ యాసిడ్, డాల్డా ప్యాకెట్లను కలిపి కోహినూర్ పేరుతో నకిలీ పాల ఉత్పత్తులను తయారు చేస్తున్నాడు. పరిసర ప్రాంతాలతో పాటు నగరంలోని వివిధ షాపుల్లో విక్రయిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్ఓటీ పోలీసులు మంగళవారం ఆ ఇంటిపై దాడి చేసి, 300 కిలోల పనీర్, 4500 లీటర్ల పామ్ ఆయిల్, 750 లీటర్ల ఎసిటిక్ యాసిడ్, 750 లీటర్ల డాల్డా, 16,250 కిలోల స్కిమ్డ్ మిల్క్ పౌడర్, 15 లీటర్ల గ్లూకోజ్ ద్రవం, 1500 కిలోల కలాకాన్ రా మెటీరియల్, 1500 కిలోల చిరోటీ రవ్వ, నకిలీ ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకుడు గజేందర్‌సింగ్ రాజ్‌పురోహిత్‌ను అదుపులోకి తీసుకుని, తదుపరి దర్యాప్తు నిమిత్తం మేడిపల్లి పోలీసులకు అప్పగించారు.

నిమజ్జనానికి వెళ్లి వచ్చే సరికి ఇంట్లో చోరీ

వెంగళరావునగర్, అక్టోబర్ 15: దుర్గామాత నిమజ్జనానికి వెళ్లి వచ్చేసరికి ఇంటి తాళాలు పగులగొట్టిన దుండగులు ఇంట్లోని బంగారు, వెండి నగలు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. శివమ్మ పాపిరెడ్డి హిల్స్‌కు చెందిన డి.నర్సింహ బ్రహ్మశంకర్ నగర్ కూడలి వద్ద దుర్గామాత విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. సోమవారం నిమజ్జనం చేసేందుకు ఇంటికి తాళాలు వేసి.. ట్యాంక్ బండ్‌కు వెళ్లారు. కొద్ది సేపటి తర్వాత అతడి సోదరుడు ఫోన్‌చేసి.. ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయని చెప్పాడు. ఇంటికి వచ్చే చూడగా.. ఇంట్లోని సామగ్రి చిందరవందరగా పడి ఉన్నాయి. అల్మారాలో దాచిన బంగారు ఉంగరం, కమ్మలు, రూ.32,000 నగదు కనిపించలేదు. మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కూతురు ఇంటికి వెళ్లి వచ్చేసరికి..

కూతురు ఇంటికి వెళ్లి వచ్చేసరికి ఇంట్లోని బంగారు నగలు మయమైనట్లు వృద్ధ దంపతులు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మధురానగర్ కాలనీలో నివాసముండే రిటైర్డ్ ఉద్యోగి ఎం.ఉప్పలయ్య(82) భార్య ఎం.భవానీతో కలిసి ఉంటున్నారు. భవానీకి ఆరోగ్యం బాగాలేకపోవడంతో రెండు రోజుల కిందట మియాపూర్‌లో ఉన్న కూతురు ఇంటి వెళ్లారు. తిరిగి సోమవారం ఇంటికి వచ్చారు. అయితే, ఇంట్లోని బీరువాలో దాచిన 9 తులాల బంగారు నగలు కనిపించలేదు. దీంతో ఇంట్లో పనిచేసే పని మనిషిపై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

BUSINESS OFFER

★ప్రతిరోజూ రూ. 3,000/- నుండి 50,000/- సంపాదించే సువర్ణావకాశం... 100% నిజం, నిజాయితీగా, చట్టబద్ధంగా, మనం సంపాదిస్తూ, 10 మందికి ఉపాధి. ఇ-బైక్ వ్యాపారం: 9030769178. NT-335086

OLD AGE HOME

★వృద్ధులు, NRI's విలాసవంతమైన గదులు, లిఫ